# పశ్చిమగోదావరి

# గిరిజనుల భూమి సమస్యపై

# ప్రభుత్వ ఉత్తర్వులు

# కోర్టు తీర్పులు

# పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో

# భూమి హక్కుల,

# అనుభవదారుల తనిఖీకి

## ఉన్నతాధికారులు రూపొందించిన

# మార్గదర్శక సూత్రాలు

మరియు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

# గౌ. బి.ఎస్.ఎ.స్వామి

# ఇచ్చిన ఉత్తర్వులు


ప్రచురణ

శాంతి సాధన సంఘం, దర్భగూడెం

జీలుగుమిల్లి మండలం, పశ్చిమగోదావరి జిల్లా

వెల: 5 రూపాయలు

భూమి బదలాయింపు రెగ్యులేషన్లను అమలు జరుపుతున్నామనే అభిప్రాయం కలిగించడానికి ప్రభుత్వాధికారులు ప్రయత్నించారు కాని సరైన దృక్పథంతో వాటిని అమలు జరిపిన వాళ్లెవరూ లేరని ఈ కోర్టు భావిస్తోంది. దీని వల్ల గిరిజనులు కూడు, గూడు, గుడ్డ లేని నిరుపేదరికంలో జీవించాల్సి రావడమే కాక వారికి శాంతిభద్రతలు కూడా కరువయ్యాయి. అదే విధంగా గిరిజన ప్రాంతానికి వలస వచ్చి ఆస్తులు సంపాదించుకున్న గిరిజనేతరుల పరిస్థితి కూడా అగమ్యగోచరంగా ఉంది. వారి నెత్తి మీద కత్తి ఎప్పుడూ వేలాడుతూనే ఉంది. ఇద్దరి హక్కుల్నీ పరిరక్షించడమే కాక ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం కూడా అవసరమని భావిస్తున్నాను.

అందువల్ల వివిధ కమిటీలు తీసుకున్న నిర్ణయాలను కోర్టు ఉత్తర్వు రూపంలో ప్రకటించి, వాటి అమలుకు నిర్ణీత గడువు పెట్టాలని భావిస్తున్నాను. ఈ కోర్టు ఇస్తున్న ఆదేశాలు సమగ్రమైనవి, ఒకే ఒకసారి అమలు చేయాల్సినవి. మరో విధంగా చెప్పాలంటే ఈ ఆదేశాలకు అనుగుణంగా తయారు చేయబోయే భూమి హక్కుల రికార్డు తుది రికార్డు అవుతుంది. ప్రభుత్వంతో సహా అందరూ దానికి కట్టుబడి ఉండాలి. పైకోర్టులో మాత్రమే దాన్ని సవాలు చేయొచ్చు.

–జస్టిస్ బి.ఎస్.ఎ.స్వామి

**02.01.1998**

# ముందుమాట

పశ్చిమ గోదావరి గిరిజన ప్రాంతంలో భూమి హక్కులపై చెలరేగుతున్న వివాదాలను మన రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర హైకోర్టు నిరంతరం గమనిస్తూ ఆయా సందర్భాలలో ఇచ్చిన ఉత్తర్వులను ఒక పుస్తకంగా తీసుకువస్తున్నాము.

ఈ ఉత్తర్వులు మన భాషలో అందుబాటులో ఉంటే వాటిని తు.చ తప్పకుండా అమలు జరిపించుకోవడానికి మనమందరం ప్రయత్నించవచ్చు. ఆ ప్రయత్నంలో భాగంగా వీటిని మా దర్భగూడెం శివారు గ్రామాల గిరిజనులు, గిరిజనేతరులు కలిసి ఏర్పరచుకున్న శాంతి సాధన సంఘం తరపున ప్రచురిస్తున్నాం.

**20.1.2000**

–పండు పెదకన్నయ్య, పండువారి గూడెం

–అలవాల వెంకటరెడ్డి, దర్భగూడెం

# ఇందులో...


1. గిరిజన సంక్షేమ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలు (6.1.97)
2. జస్టిస్ బి.ఎస్.ఎ స్వామి ఉత్తర్వు (22.4.97)
3. గిరిజన సంక్షేమ కమిషనర్ సూచించిన మార్గదర్శక సూత్రాలు (26.6.97)
4. సర్వే నిర్వహణ కోసం జరిగిన సమావేశం మినిట్స్ (22.10.97)
5. భూమి హక్కులు, అనుభవదారుల తనిఖీకి రూపొందించిన మార్గదర్శక సూత్రాలు (5.12.97)
6. కోర్టు ధిక్కరణ కేసులో జస్టిస్ స్వామి ఇచ్చిన ఉత్తర్వులు (2.1.98)
7. గిరిజన, గిరిజనేతరుల మధ్య కుదిరిన ఒప్పందం (18.11.99)

# గిరిజన సంక్షేమ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలు

## గిరిజన సంక్షేమ కమిషనర్

## హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ నుండి

ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లందరికి –

ఫాక్స్ వర్తమానం నెం.**2278/96**/టిఆర్ఐ/ఆర్ఎల్డబ్ల్యు. తేదీ **6.1.1997**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి **30-12-96** నాడు జరిపిన సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా గిరిజన సమస్యను పరిష్కరించేందుకు తీసుకోవలసిన చర్యలను సమీక్షించింది. వివరంగా చర్చించాక వేరే నిర్ణయాలతో పాటు ఈ కింది నిర్ణయాలను కూడా తీసుకోవడం జరిగింది.

ఈ కింది చర్యలను చేపట్టడానికి వీలుగా అన్ని ఐటిడిఏల నుండి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను (గిరిజన సంక్షేమం) వెంటనే పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి పంపించాలి–

**1.** గిరిజనేతరుల స్వాధీనంలోని భూములకు సంబంధించి గిరిజనులు లేవనెత్తిన అభ్యంతరాలను తనిఖీ చేయడం

**2.** గిరిజనులకు కేటాయించడానికి అవకాశమున్న అన్ని ప్రభుత్వ భూములను గుర్తించడానికి.

**3.** గిరిజనుల పేరు మీద పట్టాలున్న భూములు (ప్రభుత్వ ఎల్.టి.ఆర్, భూసంస్కరణల మిగులు భూములు) వారి స్వాధీనంలోనే ఉండేలా చర్యలు తీసుకోవడం.

**4.** గిరిజనులకు ఏక్‌సాల్ (ఒక సంవత్సరం సాగు) పట్టాలు ఇవ్వగలిగిన పోరంబోకు భూములను గుర్తించడానికి.

అందువల్ల మీరంతా మీ కింద పనిచేసే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గిరిజన సంక్షేమం)లను వెంటనే కోట రామచంద్రపురం పంపించాలని కోరుతున్నాను. దీనిపై తీసుకున్న చర్యలను నేను **8.1.97** సాయంత్రం **5** గంటలకల్లా ప్రధాన కార్యదర్శికి తెలియజేయాల్సి ఉన్నందున మీరు వెంటనే ఫాక్స్ ద్వారా ఆ వివరాలు నాకు పంపండి.

– టి.ఎస్. అప్పారావు
గిరిజన సంక్షేమ కమిషనర్

# జస్టిస్ స్వామి ఉత్తర్వు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, హైదరాబాద్

(స్పెషల్ ఒరిజినల్ జూరిస్‌డిక్షన్)

తే.22.4.97, మంగళవారం

గౌ. జస్టిస్ బి.ఎస్.ఎ. స్వామి

రిట్ పిటిషన్ నెం. 8009/97

1.పి.గంగమ్మ

2.కుంజా సోమరాజు

3.ఎం.గంగాదేవి............ పిటిషనర్లు

వర్సెస్

1.జిల్లా కలెక్టర్, ప.గో.జిల్లా, ఏలూరు

2. గిరిజన సంక్షేమ కమిషనర్, సంక్షేమ భవన్

మసాబ్‌ట్యాంక్, హైదరాబాద్... ప్రతివాదులు

రాజ్యాంగంలోని 226 అధికరణం కింద దాఖలైన ఈ పిటిషన్‌లో, ప్రతివాదులు పశ్చిమగోదావరి జిల్లా షెడ్యూల్డ్ ప్రాంతంలో జరుపుతున్న సర్వేలో స్వచ్ఛంద సంస్థల సహాయం తీసుకున్న గిరిజనులను అనుమతించకపోవడాన్ని ఈ కోర్టు చట్టవిరుద్ధ, రాజ్యాంగ విరుద్ధ చర్యగా ప్రకటించాలని కోరడమైనది. ప్రతివాదులు ఇప్పటివరకు తయారు చేసిన నివేదికల నకళ్లను, వివిధ వ్యక్తులు సమర్పించిన స్టేట్‌మెంట్‌ల నకళ్లను సంబంధిత గిరిజనులకు లేదా ఆ ప్రాంతంలో

పని చేసే ప్రభుత్వేతర సంస్థకు ఇవ్వాలని, గిరిజనుల తరపున దాఖలైన అభ్యంతరాలను పరిశీలించమని ఆదేశించాలని కోరడమైనది.

పిటిషనర్ల తరపు న్యాయవాది: శ్రీ కె.ఎస్.మూర్తి

ప్రతివాదుల తరపు న్యాయవాది: ఎవరూ లేరు

అడ్మిషన్ దశలోనే కోర్టు ఈ కింది ఉత్తర్వునిచ్చింది-

ఈ సర్వే పనులు జరుపుతున్నదే రెండవ ప్రతివాది అయిన గిరిజన సంక్షేమ కమిషనర్ **6.1.97** నాడు పంపిన ఫాక్స్ వర్తమానం నెం.**2278/96**/టిఆర్ఐ/ఆర్ఎల్‌డబ్ల్యు ప్రకారం గిరిజనేతరుల స్వాధీనంలోని భూముల విషయంలో గిరిజనులు లేవనెత్తిన అభ్యంతరాలను తనిఖీ చేయడం కోసం. నిజానికి ఫాక్స్ వర్తమానాన్ని అనుసరించి ఇన్‌చార్జి కలెక్టర్ సర్వేలో పాల్గొనమని గిరిజనులను ఆహ్వానిస్తూ పత్రికాప్రకటన కూడా ఇచ్చారు. ఆ ప్రకటన గిరిజనులకు వారి భూములను గుర్తించడంలో సహాయపడుతున్న వారిని తమకు కూడా సహాయం చేయమని ఆహ్వానిస్తున్నట్టుగా వుంది. అలాంటపుడు సర్వే బృందాలు గిరిజనులనుగాని, సర్వే గురించి బాగా తెలిసిన వారి ప్రతినిధులు ఎవరినైనాగాని సర్వేలో పాల్గొనకుండా ఆపరాదు.

కాబట్టి సర్వే జరిగేటపుడు గిరిజనులను లేదా వారి ప్రతినిధులను అనుమతించాల్సిందిగా సర్వే బృందాలను ఆదేశిస్తున్నాం. వారు లేవనెత్తే అభ్యంతరాలను లిఖితపూర్వకంగా నమోదు చేయాలని, సర్వే ఫలితాలను ఖరారుచేసేటప్పుడు వాటికి జవాబులు ఇవ్వాలని ఆదేశిస్తున్నాం.

ఈ ఆదేశంతో రిట్ పిటిషన్‌ను మూసివేయడమైంది. ఖర్చులు ఇవ్వనక్కరలేదు.

సం.సయ్యద్ ఇస్మాయిల్
అసిస్టెంట్ రిజిస్ట్రార్

కాపీలు:

**1.** జిల్లాకలెక్టర్, ప.గోజిల్లా, ఏలూరు.

**2.** గిరిజన సంక్షేమ కమిషనర్, హైదరాబాదు

**3.** న్యాయవాది కెఎస్‌మూర్తి

# కమిషనర్ లేఖ

డిఒఆర్‌సి నెం.**671/97**/టిఆర్ఐ/పిఆర్‌సెల్, తే:**26.6.97**

డాక్టర్ శివరామకృష్ణ గారికి

పశ్చిమగోదావరి ఏజెన్సీ ప్రాంతంలో తిరిగి ప్రారంభమైన సర్వే కార్యక్రమాలకు సంబంధించి మీరు **12-6-97** నాడు రాసిన ఉత్తరం చూశాను. ఇటీవల భద్రాచలంలో జరిగిన ప్రాజెక్టు ఆఫీసర్ల సమావేశంలో దీని గురించి కోట రామచంద్రపురం ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్‌తో చర్చించాను. సర్వేలో గిరిజనులు, గిరిజనేతరులు చెపుతున్న విషయాలను తనిఖీ చేయడానికి జారీ చేసిన మార్గదర్శకసూత్రాల కాపీని మీ సమాచారం కోసం జత చేస్తున్నాను.

గౌరవాభినందనలతో

టి.ఎస్. అప్పారావు

గిరిజన సంక్షేమ కమిషనర్

# కమిషనర్ సూచించిన మార్గదర్శక సూత్రాలు

పశ్చిమ గోదావరి జిల్లా షెడ్యూల్డు ప్రాంతాలలో గిరిజన, గిరిజనేతరుల భూమి హక్కుల తనిఖీకి పాటించవలసిన మార్గదర్శక సూత్రాలు

కోటరామచంద్రపురం ఐటిడిఏ ప్రాంతంలో భూమి యాజమాన్యం, అనుభవం వగైరా విషయాలలో గిరిజనులు, గిరిజనేతరులు లేవనెత్తిన అంశాల తనిఖీని వేగవంతం చేయడానికి ఏటూరునాగారం, భద్రాచలం, రంపచోడవరంల నుండి ముగ్గురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను (గిరిజన సంక్షేమం) కోట రామచంద్రపురం పంపించడం జరిగింది. రెగ్యులర్ పనుల్ని కోట రామచంద్రాపురం ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసరు నిర్ణయం ప్రకారం అక్కడి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గిరిజన సంక్షేమం) చేస్తారు. వీరిని పంపింది ఆ ప్రక్రియను వేగవంతం చేయడానికి మాత్రమే. అందుకోసం తనిఖీలో పాటించవలసిన కొన్ని మార్గదర్శక సూత్రాలను సూచిస్తున్నాం.

1. ప్రతి గ్రామానికి సంబంధించి నిర్దిష్టంగా, తేదీల వారీగా కార్యక్రమం తయారు చేసుకోవాలి. దాని గురించి గిరిజనులకు, గిరిజనేతరులకు కూడా తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలి. తనిఖీకి కనీసం వారం రోజుల ముందు స్థానిక పత్రికల్లో వచ్చేలా పత్రికా ప్రకటన ఇవ్వాలి. స్థానిక మండల రెవిన్యూ ఆఫీసు నోటీసు బోర్డులో, అలాగే కమ్యూనిటీ కేంద్రాలు లాంటి గ్రామ కూడళ్లలో ప్రముఖంగా కనిపించేలా పెట్టాలి.

2. గిరిజన, గిరిజనేతర ప్రతినిధులను తనిఖీలో పాల్గొనడానికి అనుమతించవచ్చు. వారుగానీ, వారి ప్రతినిధులుగానీ లేవదీసే అభ్యంతరాలను, ఇచ్చే సూచనలను ఏ గ్రామానికి ఆ గ్రామానికి వేరే రిజిస్టర్ పెట్టి దానిలో నమోదు చేయాలి. రోజు చివర్లో వీటిని గట్టిగా చదివి వినిపించి సంబంధిత వ్యక్తుల సంతకాలను తీసుకోవాలి. తర్వాత ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్, కొవ్వూరు సబ్‌కలెక్టర్ వీటిని పరిశీలించి తదుపరి చర్యల గురించి నిర్ణయం తీసుకోవాలి.

3. గిరిజనులవిగా గుర్తించిన భూములలో, ఇతరత్రా అభ్యంతరాలు లేని పక్షంలో వాటిని వారికి వెంటనే కేటాయించడమే కాక స్వాధీన పరచాలి. అవసరమైన చోట నాగళ్లు, ఎద్దులు, ఎరువులు, విత్తనాలు లాంటి ముడి వస్తువులను వచ్చే ఖరీఫ్ లోగా ఇచ్చి సాయపడాలి.

4. వివాదాలున్న చోట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గిరిజన సంక్షేమం) రెగ్యులర్ ప్రొసీడింగ్స్ జరిపి తగిన ఉత్తర్వులు ఇవ్వాలి. ~~ఈ~~ నిర్ణయాలు గిరిజనులకు వ్యతిరేకంగా వచ్చిన అన్ని సందర్భాలలోను అప్పిలేట్ అథారిటీ ముందు అపీళ్లు దాఖలు చేయడానికి ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసరు చర్యలుతీసుకోవాలి.

5. శాంతిభద్రతలకు సంబంధించిన కేసు ఏదైనా ఉన్నా, గిరిజనులకు న్యాయసహాయం అవసరమైనా ఐటిడిఏ ఇప్పుడున్న న్యాయసహాయ పథకం కింద న్యాయవాదులను నియమించవచ్చు.

టి. ఎస్. అప్పారావు

గిరిజన సంక్షేమ కమిషనర్

# ముఖ్యకార్యదర్శి లేఖ

శ్రీమతి వసుధామిశ్రా, ఐ.ఎ.ఎస్ కు<br>
కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్<br>
ప.గో. జిల్లా

సచివాలయం<br>
హైద్రాబాద్ - **500022**<br>
ది.**5.12.97**

నా కార్యాలయంలో **22.10.97** సాయంత్రం నాలుగు గంటలకు పశ్చిమగోదావరి ఏజెన్సీ ప్రాంతంలో భూమి హక్కుల తనిఖీ కార్యక్రమం తీరుతెన్నుల గురించి నిర్వహించిన సమావేశం మినిట్స్ కాపీ ఈ ఉత్తరంతో పాటు పంపుతున్నాను. దానితో పాటు అనుభవదారుల, భూమి హక్కుల తనిఖీకి రూపొందించిన మార్గదర్శక సూత్రాలనుకూడా పంపుతున్నాను. ఈ మినిట్స్, మార్గదర్శక సూత్రాల ప్రకారం చర్య తీసుకోవలసినది.

ఎస్.రే, ఐఎఎస్<br>
ముఖ్యకార్యదర్శి, సాంఘిక సంక్షేమ శాఖ

కాపీలు:

ముఖ్యకార్యదర్శి, రెవిన్యూ శాఖ

కమిషనర్, గిరిజన సంక్షేమ శాఖ

ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ, కోటరామచంద్రాపురం

# సర్వే కోసం జరిగిన సమావేశం మినిట్స్

(పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో భూముల హక్కుల తనిఖీ కార్యక్రమంలో అనుసరించవలసిన విధానాలను చర్చించడానికి సాంఘిక సంక్షేమ శాఖలో **22.10.97** తేదీన ఈ సమావేశం జరిగింది)

పై సభకు హాజరైన సభ్యులు:

1. శ్రీ ఎస్.రే, ముఖ్య కార్యదర్శి, సాంఘిక సంక్షేమ శాఖ
2. శ్రీ జె.రాంబాబు, ముఖ్యకార్యదర్శి, రెవెన్యూ శాఖ
3. శ్రీ జి.సుధీర్ , కార్యదర్శి, రెవెన్యూ శాఖ
4. శ్రీ టి.ఎస్.అప్పారావు, కమిషనర్, గిరిజన సంక్షేమం
5. శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐటిడిఏ కోటరామచంద్రపురం, పశ్చిమగోదావరి జిల్లా.
6. డాక్టర్ శివరామకృష్ణ, శక్తి సంస్థ

సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ సమావేశాన్ని ప్రారంభిస్తూ సమావేశానికి గల అవసరాన్ని వివరించాక శివరామకృష్ణను ఆహ్వానించి ఏజెన్సీ ప్రాంతంలో భూమి హక్కుల తనిఖీ నిర్వహణ గురించి అభిప్రాయం అడిగారు. శివరామకృష్ణ తమ వద్ద కొంత సమాచారం మాత్రమే ఉన్నదని, దీన్ని అధికారులకు అందించగలమని, కానీ పూర్తి సమాచారం అందించే బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించాలని అన్నారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ తనిఖీ విధానంపై సమర్పించిన ప్రతిపాదనలను శివరామకృష్ణ అంగీకరించారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ తాము రూపొందించిన మార్గదర్శక సూత్రాలను వివరించారు. గిరిజన సంక్షేమ కమిషనర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ చెప్పిన పద్ధతిని ఎందుకు అమలు జరపలేదని అడిగారు. ప్రాజెక్ట్

ఆఫీసర్ జవాబిస్తూ ఈ పద్ధతి కొన్ని గ్రామాల్లో మొదలుపెట్టాముగానీ గిరిజనులకు ఎక్కువ భూమి రావడం లేదని గ్రహించి వారి ప్రతినిధులు సర్వేకి హాజరుకావడం ఆపుచేశారన్నారు. 'శక్తి' సంస్థ గూర్చి ప్రస్తావిస్తూ ముఖ్యకార్యకర్తలు క్రిమినల్ కేసుల్లో చిక్కుకుని ఉన్నందువల్ల, కొన్ని అంతర్గత సమస్యల వల్ల వారు సర్వే పనిపై శ్రద్ధ చూపలేకపోయినట్లు అభిప్రాయపడ్డారు.

ఏ గ్రామంలోనైనా గిరిజనులకు భూమి వచ్చే అవకాశం లేదని తేలితే ఆ గ్రామంలో పరిస్థితిని ఏ విధంగా పరిష్కరించాలని సభ్యులందరూ చర్చించారు. ఈ తనిఖీ గిరిజనేతరుల అధీనంలోగల భూములు చట్టబద్ధమైనవే అని నిరూపించడానికి చేపట్టిన చర్యగా గిరిజనులు అనుకోరాదని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి హెచ్చరించారు.

శక్తి సంస్థ వారు తక్షణమే గిరిజనులను తనిఖీ కార్యక్రమానికి తయారు చేయాలని, అంతేకాకుండా ఎక్కడైతే గిరిజనులకు భూములు రావడానికి అవకాశం లేదో అక్కడ వారు నిరుత్సాహపడకుండా ఉండేందుకు వారిని మానసికంగా ఉండేందుకు కూడా తయారు చేయాలని సలహా ఇచ్చారు.

గిరిజనులకు సరిపోయినంత భూమి లభించని చోట వారిని సంతృప్తి పరచడానికి ప్రాజెక్ట్ ఆఫీసరు, శక్తి సంస్థ కలిసి గిరిజనుల కోసం వేరే మార్గాలను ఆలోచించి, వనసంరక్షణ సమితి తదితర అభివృద్ధి పథకాలను ఏర్పాటు చేయాలని రెవెన్యూ ముఖ్య కార్యదర్శి అన్నారు. తప్పని పరిస్థితులలో మాత్రమే భూమి కొనుగోలు ప్రతిపాదనలు చేపట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. గిరిజనులందరికీ అభివృద్ధి పథకాలను చేపట్టాలంటే కష్టమనీ **20, 25** కంటే ఎక్కువగ్రామాలకు సరిపోయే నిధులు లభించకపోవచ్చునని గిరిజన సంక్షేమ కమిషనర్ వ్యక్తపరిచిన సందేహానికి స్పందిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శులిద్దరూ దీన్ని ప్రత్యేక సందర్భంగా భావించి తగినన్ని నిధులు విడుదల చేయించగలమని హామీ యిచ్చారు. ఇప్పుడున్న నిధులు ప్రస్తుతం వివాదాస్పదంగా ఉన్న **35** గ్రామాలకు మాత్రమే సరిపోతుందని భావించారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ శివరామకృష్ణతో కలిసి ఈ సమావేశంలో చర్చించిన విషయాల ఆధారంగా అధికారులు, అనధికారుల పాత్ర గురించి ముఖ్య కార్యదర్శి పరిశీలన నిమిత్తమై ఒక నోట్ రాయాలని నిర్ణయించారు.

సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సమావేశానికి హాజరయిన సభ్యులకు కృతజ్ఞతలు తెలియచేస్తూ ముగించారు.

★

# పశ్చిమగోదావరి జిల్లా ఏజన్సీ ప్రాంతంలో భూమి హక్కులు, అనుభవదారుల తనిఖీ కార్యక్రమంలో పాటించవలసిన

# మార్గదర్శక సూత్రాలు

జిల్లా కలెక్టరు అన్ని రాజకీయ పార్టీలతోనూ, స్వచ్ఛంద సంస్థలతోనూ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించి తనిఖీ కార్యక్రమం పద్ధతులను వివరించి, వారి దగ్గరి నుంచి సంపూర్ణ సహకారం గురించి, తనిఖీ ఫలితాలకు కట్టుబడి ఉండటం గురించి రాతపూర్వకంగా అంగీకారం తీసుకోవాలి.

ఏజెన్సీ ప్రాంతంలో జరిగే భూముల హక్కులు, అనుభవదారుల తనిఖీ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, అనధికారులు మరియు ఏజెన్సీలో పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థలు ఈ క్రింది మార్గదర్శక సూత్రాలు పాటించాలి.

**1.** వివిధ సంస్థలు, పార్టీలు తాము పనిచేస్తున్న గ్రామాల్లో గిరిజనులతో విస్తృతంగా చర్చలు జరిపి, వారికి తనిఖీ కార్యక్రమంలో అనుసరించబోయే పద్ధతులు, విధానాల గురించి తెలియజెప్పాలి. వారికి చెందవలసినవిగా తేలిన భూములను అప్పగించడానికి వివిధ దశలలో పట్టే కాలం గూర్చి కూడా తెలియచేయాలి. ఎక్కడైతే గిరిజనులకు గిరిజనేతరుల దగ్గర నుంచి అసలు భూమి రాదో లేదా చాలా కొద్ది భూమి వస్తుందో ఆ గ్రామాలో గిరిజనులను మానసికంగా తయారు చేయడానికి ప్రత్యేకప్రయత్నం చేయాలి.

**2.** ఈలోగా వివిధ సంస్థల ప్రతినిధులు, గిరిజన ప్రతినిధులు, సర్వే సిబ్బంది నుంచి ఇద్దరు లేదా ముగ్గురు డిప్యూటీ తాసిల్దార్లు, అవసరమైనంతమంది సర్వేయర్లు, అవసరమైతే స్వయంగా సబ్‌కలెక్టరు, ఎమ్మార్వో కార్యాలయంలోగానీ, పిఓ ఆఫీసులో

గానీ తనిఖీ కార్యక్రమానికి కావలసిన సమాచారం సేకరించి ఈ క్రింది జాబితాను తయారు చేసుకోవాలి.

i)గ్రామపటాన్ని తీసుకొని దానిలో 1933 ఆర్ఎస్ఆర్ ప్రకారం గిరిజనులకు చెందిన భూములకు ఒక రంగు, గిరిజనేతరులకు చెందిన భూములకు వేరొక రంగు వేసి ఎడబ్ల్యుడి లేక పోరంబోకు భూములుండే చోట ఖాళీగా ఏ రంగూ లేకుండా తయారు చేయాలి.

ii)1933 సంవత్సరం నుంచి గవర్నమెంటు భూములు పొందిన లబ్ధిదారుల వివరాలను ఐటిడిఏ పిఓ కంప్యూటర్లో భద్రపరిచారు. ఆ భూములకు వేరే రంగు వేయడం మంచిది.

iii)స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గిరిజన సంక్షేమం) ఈరోజు వరకు గిరిజనులకు లేదా ప్రభుత్వానికి అనుకూలంగా ఇచ్చిన 1473 తీర్పులను కంప్యూటరైజ్ చేశారు. కొన్ని కేసులలో ఎమ్మార్వోలు భూమి తనిఖీని కూడా పూర్తి చేశారు. దానికి, కేసులు ఏ స్థితిలో ఉన్నాయో ప్రభుత్వేతర సంస్థల వద్ద వున్న నిర్దిష్ట సమాచారాన్ని చేర్చి తాజా జాబితాను తయారు చేయాలి.

iv)భూ పరిమితి చట్టం కిందకి వచ్చే కేసులకు సంబంధించిన సమాచారాన్ని మండల రెవెన్యూ ఆఫీసరు నుండి మరియు ఎ.ఆర్.డి.ఓ లాండ్ రికార్డ్స్, ఏలూరు వారి నుండి సేకరించాలి.

v)1970 సంవత్సరం తర్వాత జరిగిన రిజిస్ట్రేషన్ వివరాలకు ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుండి సేకరించడం జరిగింది.

vi)అడంగల్ ప్రకారం పోరంబోకు భూములను ఆక్రమించుకున్న ఉన్న వారి పట్టికను తయారు చేయాలి.

3.గ్రామంలో దండోరా వేసి గిరిజనులకు, గిరిజనేతరులకు తెలియచేసిన తర్వాత, తనిఖీ సిబ్బంది ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు లేక రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి వెళ్ళి 1933 ఆర్.ఎస్.ఆర్ రికార్డు, సరికొత్త అడంగల్ మరియు ఇతర రికార్డులను గ్రామస్తులకు యివ్వాలి. తనిఖీ సిబ్బంది గిరిజనేతరులను 1933 తర్వాత భూమి వారికి ఏ విధంగా వచ్చిందీ ప్రశ్నిస్తారు. వారి జవాబుల పట్ల గిరిజనులకేమైనా అభ్యంతరాలు ఉన్నాయేమో అడిగి తెలుసుకోవాలి. కొంతమంది గిరిజనేతరులకు దస్తావేజులు చూపించడానికి సమయం పట్టవచ్చు. అదేవిధంగా గిరిజనులకు రికార్డు చదువుకొని, తమ అభ్యంతరాలను తెలియచేయడానికి సమయం పట్టవచ్చు. అందువల్ల మొదటి సమావేశం నిర్వహించాక వారం రోజుల సమయం ఇచ్చి

రెండవ సమావేశం నిర్వహించాలి. అదే విధంగా గిరిజనేతరుల వద్ద ఎల్.టి ఆర్ కేసులకు సంబంధించి ఏమైనా స్టేఆర్డర్లుగానీ, ఇతర తీర్పులుగానీ ఉంటే ఆ సమాచారాన్ని తనిఖీ సిబ్బంది వారిని అడిగి తెలుసుకోవాలి. గిరిజనులకు మంజూరైన ప్రభుత్వభూముల వివరాలు వారికి చదివి వినిపించాలి. ఆ భూములు వారి అనుభవంలో ఉన్నదీ లేనిదీ తెలుసుకోవాలి. సబ్‌కలెక్టర్ మండల రెవెన్యూ అధికారి, సర్వే చేసే డిప్యూటీ తాసిల్దార్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు (గిరిజన సంక్షేమం) మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తప్పకుండా ఈ సభలకు హాజరు కావాలి.

4. రెండవ సభలో గిరిజనులు లేవనెత్తిన అభ్యంతరాలను, గిరిజనేతరులు చూపించే సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకొని ఈ క్రింది జాబితాను తయారు చేయాలి.

i) భూముల కేటాయింపులో ఏమైనా అవకతవకలు జరిగి ఉంటే వాటిని రద్దు చేసి, కొత్త వారికి మంజూరు చేసే కార్యక్రమాన్ని సబ్‌కలెక్టర్ మూడు వారాల్లో పూర్తి చేయాలి.

ii) గవర్నమెంట్ జిరాయితి భూమి పట్టికని చూసి ప్రభుత్వ భూములు గిరిజనేతరుల చేతిలో ఉన్నా లేక ఎవరికీ యివ్వకుండా బంజరుగా ఉన్నా అటువంటి భూములను ఒక వారం లోపల గిరిజనులకు కేటాయించాలి.

iii) ఎల్.టి ఆర్ కేసుల పట్టికను తయారు చేసి స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (గిరిజన సంక్షేమం) కోర్టులో దాఖలుచేయాలి. ఈ కేసుల విచారణను వీలైనంత వరకు మూడు నెలల లోపల పూర్తి చేయాలి.

iv) అపీలుకు పనికొచ్చే కేసుల పట్టికను తయారుచేసి గవర్నమెంటు ఏజెంటు కోర్టులో దాఖలు చేయాలి. ఈ కేసుల విచారణ కూడా నాలుగు నెలల లోపల పూర్తి చేయాలి.

v) ప్రభుత్వం వద్ద లేక హైకోర్టులో అపరిష్కృతంగా వున్న కేసులను ప్రాజెక్ట్ ఆఫీసర్ పర్యవేక్షించి వాటి కోసం హైద్రాబాద్‌లో ప్రత్యేకంగా ఒక న్యాయవాదిని నియమించాలి.

vi) భూపరిమితి చట్టం కిందికి వచ్చే కేసులు మరియు బినామి కేసుల గురించి గిరిజనులు నిర్దిష్ట సమాచారం యివ్వాలి. వాటిని సంబంధిత అధికారుల వద్ద రెండు వారాల లోపల దాఖలు చేయాలి.

vii) గిరిజనులు మరియు గిరిజనేతరులకు పట్టాభూములు స్పష్టంగా ఉన్న చోట ఆ పట్టికను అన్ని వర్గాల వారూ గౌరవించాలి.

5. ఎక్కడైతే గిరిజనులకు చాలినంత భూమి ఉండదో అక్కడ సంబంధిత సంస్థ

మరియు ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసరు కలిసి భూమిలేని పేదలకు (గిరిజనులకు) ఉపయోగపడేలా వనసంరక్షణ సమితుల్ని, ఇతర ఆర్థికాభివృద్ధి పథకాలను అమలు చేయడం లాంటివి చేయాలి.

**6.** తనిఖీ కార్యక్రమం సజావుగా జరగడానికిగాను జిల్లా కలెక్టర్ తగినంత మంది డిప్యూటీ తాసిల్దారులను, సర్వేయర్లను, ఇతర సిబ్బందిని సమకూర్చాలి.

**7.** ఏదైనా గ్రామంలో షెడ్యూల్డు కులాల వారి అనుభవంలో ఉన్న పట్టాలేని భూములను గిరిజనులు కనక ఆక్రమించుకుని ఉంటే ఆ ఎస్సిలకు ఏజెన్సీ బయట ఎస్సి భూమి కొనుగోలు పథకం కింద భూమిని కొని, ఇళ్ల స్థలంతో సహా సమకూర్చి పునరావాసం కల్పించాలి.

**8.** సర్వేను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి, గిరిజనులలో నమ్మకాన్ని కలిగించడానికి ఇంతకు ముందు కాబినెట్ సబ్ కమిటీలో చర్చించిన విధంగా గిరిజనులపై ఉన్న చిన్న చిన్న కేసుల పట్టికను తయారు చేసి, వాటిని ఎత్తివేయడానికి చర్య తీసుకోవాలి.

**9.** గ్రామంలో తనిఖీ కార్యక్రమం పూర్తయిన తర్వాత సబ్‌కలెక్టర్ మరియు సంబంధిత సంస్థల ప్రతినిధులు కలిసి సర్వే కార్యక్రమంలో జరిగిన విషయాలను పేర్కొంటూ సంయుక్తంగా పత్రికా ప్రకటన యివ్వాలి. ఆ తర్వాత పూర్తి సమాచారంతో తయారైన నివేదికను ప్రాజెక్ట్ ఆఫీసరుకు కంప్యూటరైజ్ చేయడానికి వీలుగా అందించాలి. గిరిజన సంక్షేమ కమిషనర్‌కు కూడా తెలియచేయాలి.

**10.** మళ్లీ ఇబ్బందులు రాకుండా ఈ తనిఖీ కార్యక్రమానికి గ్రామాలను అక్షరక్రమంలో ఎంపిక చేసుకోవాలి.

**11. 1933** ఆర్.ఎస్.ఆర్/ఫెయిర్ అడంగల్ మరియు అడంగల్ కాపీలను తగినంత ముందుగానే అన్ని గ్రామాలకు అందజేయాలి.

సం/- ఎస్.రే

ప్రిన్సిపల్ సెక్రటరీ, సాంఘిక సంక్షేమ శాఖ

# కోర్టు ధిక్కారణ కేసులో ఉత్తర్వులు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, హైదరాబాదు

గౌ. న్యాయమూర్తి బి.ఎస్.ఎ స్వామి

కోర్టు ధిక్కారణ కేసు నెం. **1381/1997** నిర్ణయమైన తేదీ:**2.1.98**

పాయం గంగమ్మ- పిటిషనర్

వర్సెస్

వసుధామిశ్రా, మరి ఒకరు- ప్రతివాదులు

ఏజెన్సీ చట్టాలు - ఏజెన్సీ ప్రాంతాల వడ్డీ, భూమి బదలాయింపుల చట్టం I/**1917** - భారత రాజ్యాంగం **1950,10**వ భాగం, **5**వ షెడ్యూలు - ఆం.ప్ర. షెడ్యూల్డు ప్రాంతాల భూబదలాయింపు క్రమబద్ధీకరణ చట్టం - **1959** - దానికి **1970**లో జరిగిన సవరణ - ఆం.ప్ర. (షెడ్యూల్డు ప్రాంతాల రైతువారీ సెటిల్మెంట్) రెగ్యులేషన్ II/**1970** - రెగ్యులేషన్‌లోని వివిధ అంశాల అమలు - గిరిజన ప్రాంతాలలో భూవివాదాల పరిష్కారానికి, గిరిజన గిరిజనేతర ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం మధ్యమధ్యలో జారీ చేసిన మార్గదర్శక సూత్రాలు సక్రమంగా అమలు జరగకపోవడం - షెడ్యూల్డు ప్రాంతాలలో ప్రభుత్వ భూముల్ని ఆక్రమించుకున్న గిరిజనేతర పేదలను తొలగించవద్దని **13.8.1979**నాడు జారీ చేసిన జి.ఓ.ఎంఎస్ నెం. **129** ప్రభుత్వ పరిధిలో

లేకపోవడమే కాక చట్టవిరుద్ధం కావడం - వారికనుకూలమైన ఇదివరకటి జి. ఓలను కొట్టెయ్యకపోవడం వల్ల ఈ పేదలను ఖాళీ చేయడానికి ఎటువంటి చర్యా తీసుకోకపోవడం - ఫలితంగా షెడ్యూల్డ్ ప్రాంతాలలో అలజడి, గిరిజన గిరిజనేతరుల మధ్య వరసగా ఘర్షణలు జరగడం - మార్గదర్శక సూత్రాలకు కొన్ని సవరణలు అవసరం కావడం - గిరిజన గిరిజనేతరుల మధ్య వున్న దీర్ఘకాలిక వివాదాల పరిష్కారానికి, శాంతి సామరస్యాల పునరుద్ధరణకు మరికొన్ని ఆదేశాలు అవసరమని భావించడం - అందువల్ల ప్రభుత్వంతో సహా అందరూ పాటించవలసిన సమగ్రమైన ఆదేశాలను మార్గదర్శక సూత్రాలుగా జారీచేయడం - వాటిలో జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు సమయాన్ని నిర్ణయించడం - తరం కట్టిన మెట్టుగయాళు భూముల కేటాయింపు - ఎస్టేటు గ్రామాలలో బంజరు భూములకు సంబంధించి అనుభవదారులకు పట్టాలు యివ్వడం - వివిధ వేదికల ముందు అపరిష్కృతంగా ఉన్న కేసుల పరిష్కారం వగైరాలున్నాయి. తనిఖీ పనితో సహా ఏజెన్సీ చట్టాల అమలుతో సంబంధం వున్న వారందరూ ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు జరపాలని ఆదేశించడమైంది.

(పేరాలు 12 నుంచి 17 వరకు)

పిటిషనర్ తరపు న్యాయవాది: శ్రీ కె.ఎస్.మూర్తి;

ప్రతివాదుల తరపు న్యాయవాది: సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్లీడరు

# ఉత్తర్వు

తే.18.11.1997న ఈ కోర్టు యిచ్చిన ఉత్తర్వులను ప్రతివాదులు అమలు పరచక ఉల్లంఘించారని ఈ కోర్టు ధిక్కారణ కేసును దాఖలు చేశారు.

2.'శక్తి' సంస్థ అభ్యర్థన పై తే.22.10.1997న సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశం ఏజెన్సీ రెగ్యులేషన్లను అమలు పరచడానికి అనుసరించవలసిన పద్ధతులపై ఒక నిర్ణయానికి వచ్చింది. ఆ నిర్ణయాలను, తే.24.9.1997న జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశానికి అనుగుణంగా ప్రభుత్వం యిచ్చిన ఆదేశాలను కూడా ఈ కోర్టులో దాఖలు చేయడం జరిగింది.

3.పశ్చిమ గోదావరి జిల్లాలో గిరిజనుల అలజడిని అదుపు చేయడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి 30-12-1996న తన ఛాంబర్స్‌లో జరిపిన సమీక్షా సమావేశాన్ని అనుసరించి గిరిజన ప్రాంతాలకు సంబంధించిన వివిధ రెగ్యులేషన్ల అమలు పై ప్రభుత్వం 6-1-1997న సర్వే కార్యక్రమాలు ప్రారంభించింది. గిరిజన, గిరిజనేతరుల స్వాధీనంలోని భూములు ఎన్.జి.వోల, గిరిజనుల సహకారం లేకుండానే గుర్తించడం దీని ఉద్దేశం. దీని వలన ఏజెన్సీ ప్రాంతంలో శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమై వివిధ స్థాయిలలో - అధికారుల స్థాయిలో, మంత్రుల కమిటీ స్థాయిలో ఈ సమస్యపై చర్చలు జరిగాయి. ఈ సమావేశాలన్నిట్లోను ఏజెన్సీ చట్టాలను అమలు చేసే సిబ్బందికి రకరకాల మార్గదర్శక సూత్రాలను ఇవ్వడం జరిగింది. కొన్నిటి గురించి ఒకటికంటే ఎక్కువ ఆదేశాలు ఉండడం, కొన్నిటికి వివరణలు అవసరం కావడం, కొన్ని చట్టాలను

సమర్థవంతంగా అమలు చేయడానికి మరికొన్ని మార్గదర్శక సూత్రాలు అవసరమని కోర్టు భావించడం వల్ల ఈ విషయంలో గిరిజన సమస్యల గురించి బాగా తెలిసిన సీనియర్ న్యాయవాది శ్రీ బి.తారకం, గిరిజనేతరుల తరఫున అనేక కేసులు వాదించిన అనుభవం, పరిజ్ఞానం ఉన్న గిరిజన ప్రాంతపు మరో సీనియర్ న్యాయవాది శ్రీ ఎం.ఆర్.కె.చౌదరి సహాయం తీసుకోవాలని నిర్ణయించింది.

**4.** గిరిజన ప్రాంతంలో భూసమస్యల పరిష్కారం కోసం, గిరిజన గిరిజనేతరుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఎప్పటికప్పుడు అనేక సూచనలు యివ్వడం జరిగింది. ఈ కోర్టు అనుభవం ఏమిటంటే ఏజెన్సీ ప్రాంతంలో ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సంబంధిత అధికారులు రికార్డులను పరిశీలించకుండానే, గిరిజనేతరులకు వారి వాదనను రుజువు చేసుకోవడానికి అవకాశం యివ్వకుండానే ఏవేవో ఉత్తర్వులు ఇవ్వడం జరుగుందని. ఈ విధమైన ఉత్తర్వులు సహజంగానే అనేక అప్పీళ్లకు దారితీశాయి. అధికారుల చర్యల వలన ఉపయోగం లేకుండాపోవడమేకాక, ఈ రెగ్యులేషన్లు పుస్తకాలకు మాత్రమే పరిమితమై నాగరిక సమాజాన్ని వెక్కిరిస్తున్నట్లుగా ఉండిపోయాయి.

**5.** మార్గదర్శక సూత్రాలను ప్రకటించే ముందు సంబంధిత వ్యక్తులందరూ ఈ సమస్యను బాగా అర్థం చేసుకోవడానికి వీలుగా ఏజెన్సీ చట్టాల చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తాను. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత కూడా గిరిజన ప్రాంతాలను, మైదానాలను వేరువేరుగానే చూశారు. గిరిజనుల జీవన పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం వారికీ, మైదాన ప్రాంతం వారికీ వేరు వేరు చట్టాలను చేసి అమలు పరిచింది. ప్రస్తుతం మనం భూమి గురించి మాత్రమే ఆలోచిస్తున్నాం కనుక, నేను గిరిజనుల సంక్షేమం కోసం రూపొందించబడి, అమలు కాని రెగ్యులేషన్ల గురించి మాత్రమే ప్రస్తావిస్తాను. గిరిజన ప్రాంతాలలో అలజడులు జరిగి ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవించినప్పుడు మాత్రమే ప్రభుత్వం వారిని శాంతింపజేయడానికి కొన్ని రెగ్యులేషన్లను తీసుకొస్తోందని రికార్డు చూస్తే తెలిసిపోతుంది. వీటిలో మొదటిది ఏజెన్సీ ప్రాంతాల వడ్డీ మరియు భూమి బదలాయింపు చట్టం I/ **1917. -**

దీని ప్రకారం ప్రభుత్వ ఏజెంట్‌గా నియమించబడిన జిల్లా కలెక్టర్ లిఖితపూర్వక అనుమతితో మాత్రమే ఒక గిరిజనుడు తన భూమిని ఒక గిరిజనేతరుడికి అమ్మగలడు. ఇది **1879** నాటి రంప తిరుగుబాటు ఫలితంగా వచ్చిన చట్టం.

స్వాతంత్ర్యం వచ్చాక 26-1-1950న రాజ్యాంగం అమలులోకి వచ్చింది. దీనిలోని పదోభాగం షెడ్యూల్డు ప్రాంతాల పరిపాలనా పద్ధతులకు సంబంధించినది. అస్సాం, మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్‌లకు ఆరవ షెడ్యూలు వర్తించగా మిగిలిన రాష్ట్రాలలోని షెడ్యూల్డు ప్రాంతాలకు ఐదవషెడ్యూలు వర్తిస్తుంది. ఐదవ షెడ్యూలులోని 'ఎ' భాగం ప్రకారం రాష్ట్రగవర్నరు తన రాష్ట్రంలోని షెడ్యూల్డు ప్రాంతాల పరిపాలనకు సంబంధించి ఏటా లేదా రాష్ట్రపతి కోరినపుడు ఒక స్థితిగతుల నివేదికను (status report) ఆయనకు పంపించాలి.

అప్పుడు కేంద్రప్రభుత్వం వీటి పరిపాలన గురించి రాష్ట్రాలకు తగు ఆదేశాలు ఇవ్వవచ్చు. ఇదే షెడ్యూలు 'బి' భాగంలో ఈ ప్రాంతాల పరిపాలనకు ప్రతి రాష్ట్రంలో 22 మంది సభ్యులతో కూడిన గిరిజన సలహా మండలిని నెలకొల్పాలని పేర్కొన్నారు. వీరిలో నాలుగింట మూడు వంతుల మంది గిరిజన ఎమ్మెల్యేలు ఉండాలి. అంతమంది గిరిజన ఎమ్మెల్యేలు లేకపోతే ఇతర గిరిజనులతో ఆ స్థానాలను భర్తీ చేయాలి. గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి సంబంధించిన అంశాలలో ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం ఈ మండలి విధి. గిరిజన ప్రతినిధులు ఎన్నికవుతూనే ఉన్నా, ఈ మండలి నిజంగా పని చేస్తున్నట్లయితే స్వాతంత్ర్యం వచ్చిన 50 ఏళ్ల తర్వాత కూడా గిరిజన ప్రాంతాలలో పరిస్థితులు ఇంత దయనీయంగా ఎందుకున్నాయో అర్థం కావడం లేదు. ఈ ప్రశ్నకు బహుశా మిగతావారి కంటే గిరిజన ప్రతినిధులనబడేవాళ్లే సమాధానం బాగా చెప్పగలరేమో. తమను అసెంబ్లీకి పంపినవారి కోసం తామేం చేస్తున్నామో వారు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చింది.

**6.** ఈ విషయం పక్కకు పెట్టి గవర్నర్‌కున్న అధికారాలను చూద్దాం. షెడ్యూల్డు ప్రాంతాలలో శాంతి కోసం మంచి పరిపాలన కోసం రెగ్యులేషన్లు తీసుకువచ్చే అధికారం గవర్నర్‌కుంది. ముఖ్యంగా అక్కడ సౌకర్యాలను కోల్పోయే వర్గం పట్ల పక్షపాతం చూపించకుండా నిర్ణయాలు తీసుకోగల సావకాశం ఆయనకుంది. ఈ రెగ్యులేషన్ల ద్వారా ఆయన భూమి బదలాయింపును అరికట్టవచ్చు లేదా వాటిపై కొన్ని పరిమితులు విధించవచ్చు.

**7.** పై పని కోసం రెగ్యులేషన్లను రూపొందించేటపుడు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏ చట్టాన్నయినా లేదా గిరిజన ప్రాంతాలలో తాత్కాలికంగా అమలులో ఉన్న ఏ చట్టాన్నయినా రద్దుచేసే, సవరించే అధికారం గవర్నర్‌కు ఉంది. గిరిజన సలహా

మండలి పని చేస్తున్న చోట మాత్రం ఈ రెగ్యులేషన్లను వాటితో సంప్రదించాకే జారీ చేయాలి. ఒక ప్రాంతాన్ని షెడ్యూల్డు ప్రాంతంగా ప్రకటించడానికిగాని, ఒక ప్రాంతాన్ని షెడ్యూల్డు ప్రాంతం నుంచి తీసివేయడానికిగాని రాష్ట్రపతికి మాత్రమే పార్ట్ 'సి' కింద అధికారం ఉంది. రాజ్యాంగం అమలులోకి వచ్చాక వచ్చిన మొదటి రెగ్యులేషన్ ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంతాల భూమి బదలాయింపు రెగ్యులేషన్, **1959.** ఈ చట్టం కింద గిరిజనేతరుల మధ్య భూమి బదలాంపు జరగొచ్చు. కాని గిరిజనుల నుండి గిరిజనేతరులకు మాత్రం భూమి బదలాయింపు జరగకూడదు. దీన్ని సవరిస్తూ ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు రెగ్యులేషన్, **1970** వచ్చింది. (దీన్ని ఇక నుంచి I/**70** చట్టం అందాం) . ఈ రెగ్యులేషన్ ప్రకారం షెడ్యూల్డు ప్రాంతాలలోని భూములన్నీ గిరిజనులవే, ఇతరత్రా రుజువైతే తప్ప. ఇంకో రకంగా చెప్పాలంటే ఒక భూమి గిరిజనుడిది కాదని రుజువు చేయాల్సిన బాధ్యత గిరిజనేతరుడిదే అవుతుంది.

**1968**లో శ్రీకాకుళం అడవుల్లో ప్రారంభమైన నక్సలైట్ ఉద్యమాన్ని అరికట్టడం కోసం ఈ రెగ్యులేషన్ తీసుకొచ్చారని వేరే చెప్పనక్కరలేదు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంతాల రైత్వారీ సెటిల్‌మెంట్ రెగ్యులేషన్, **1970** (ఇక నుంచి II/**70** అందాం) కూడా వచ్చింది. ఇది **1948**లో ప్రభుత్వం రద్దు చేసి స్వాధీనం చేసుకున్న ఎస్టేటు గ్రామాల భూముల పరిష్కారానికి ఉద్దేశించిన రెగ్యులేషన్. **1948**నాటికి ఈ భూముల సర్వే, సెటిల్‌మెంట్‌లను ప్రభుత్వం ఖరారు చేయలేకపోయింది కనుక వాటిని క్రమబద్ధం చేయడానికి ఈ **II/70** తీసుకొచ్చారు. దీని ప్రకారం గిరిజనేతరులు ఎస్టేటు రద్దుకు ముందు వరసగా **8** ఏళ్ల పాటు భూమి చట్టబద్ధంగా తమ స్వాధీనంలోనే ఉందని రుజువు చేసుకోవాల్సి ఉంటుంది. **1978**లో మరో అడుగు ముందుకేసి భూమి బదలాయింపు నిబంధనలను ఉల్లంఘించిన వారికి ఏడాది జైలుశిక్ష విధించేందుకు వీలుగా **I/70**కి సవరణ తీసుకొచ్చారు. ఈ సవరణను సుప్రీంకోర్టు కూడా ఆమోదించింది. ఈ రెగ్యులేషన్లకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు అధికారులు చెపుతున్నారు కాని ఏ ఒక్క సందర్భంలోనూ ఇంతవరకు చర్య తీసుకున్న దాఖలాలు లేవు. గిరిజనుల దోపిడీని నివారించడానికి అన్ని చర్యలూ తీసుకున్నట్లు కాగితం మీద కనిపించినా, వాస్తవానికి అధికారులు ఒక్క చర్యా తీసుకోలేదు.

**8.**ముందే చెప్పినట్లు గిరిజనులలో అలజడి, అసంతృప్తి కనిపించినప్పుడల్లా

ప్రభుత్వం వెంటనే రంగంలోకి దూకి, గిరిజనుల భూముల నుండి గిరిజనేతరులను ఖాళీ చేయించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నటిస్తోంది. ఇంతవరకు గిరిజనుల అభ్యంతరాల మీద విచారణ జరిపిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు (గిరిజన సంక్షేమం) అందరూ సహజ న్యాయసూత్రాలను కూడా పాటించకుండా తీర్పులు ఇచ్చినట్టు కోర్టు పరిశీలనలో వెల్లడయింది. సహజంగానే ఇవి అప్పీళ్లకు వెళ్లడం, మరో అలజడి జరిగేదాకా ఏజెంట్ వాటిని పరిష్కరించకుండా అట్టేపెట్టడం జరుగుతోంది. పరిస్థితి చేయి దాటిపోతోందనుకున్నప్పుడు మాత్రం నోటీసులు ఇచ్చారా అనిగాని, న్యాయవాది వచ్చాడా లేదా అనిగాని చూడకుండా ఏవో తీర్పులు ప్రకటించి చేతులు దులుపుకుంటున్నాడు. దాని మీద రివిజన్ సెక్రటేరియట్‌కు వచ్చినప్పుడు సంబంధిత కార్యదర్శి ఏజెంట్ తీర్పుపై స్టే ప్రకటించి తన బాధ్యత అయిపోయిందనుకుంటున్నాడు. ఇవన్నీ మళ్లీ హైకోర్టులో రిట్‌పిటిషన్ల రూపంలో దర్శనమిస్తున్నాయి. ఫలితంగా **1959**నాటి రెగ్యులేషన్ అమలులోకి వచ్చి **40** ఏళ్లయినా గిరిజనులకు తిరిగి స్వాధీనమైన భూమి దాదాపుగా ఏమీ లేదనే చెప్పాలి.

**9.** ఈ దశలో కోర్టు ప్రకటించిన అభిప్రాయాల పట్ల ప్రభుత్వ ప్లీడరు తీవ్ర అభ్యంతరాన్ని తెలియజేశారు. అందుకు తగిన ఆధారాలేమీ లేవని అన్నారు. దీనికి జవాబుగా ఒక్కటి చెబితే చాలు. ఈ కోర్టు ముందుకు వచ్చిన రిట్ పిటిషన్లే పై నిజాలను తేటతెల్లం చేస్తున్నాయని మా అభిప్రాయం.

**10.** భూమి బదలాయింపు రెగ్యులేషన్ల అమలు ఈ విధంగా సాగుతుండగా, ప్రభుత్వం గిరిజన ప్రాంతాలలోని ప్రభుత్వ భూముల్ని కేటాయించడానికి మధ్యమధ్యలో కొన్ని ఉత్తర్వులు జారీ చేసింది. మొదట **7-10-1969**న జి.ఓ.ఎంఎస్ నెం:**971**, రెవిన్యూ కింద ప్రభుత్వ భూముల్ని గిరిజనేతరులకు యివ్వకుండా నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అయితే ఈ జి.వోను సవరిస్తూ **12.10.1997**న జి.వో ఎం.ఎస్.నెం.**41** (రెవిన్యూ) జారీ చేశారు. దాని ప్రకారం ప్రభుత్వానికి చెందిన **2.5** ఎకరాల మాగాణి లేదా **5** ఎకరాల మెట్ట వరసగా పదేళ్లపాటు ఎవరి స్వాధీనంలో ఉంటే ఆ శివాయి జమాదార్లను అధికారులు ఖాళీ చేయించకూడదు. **1974**లోజారీ అయిన మరో జి.వో ఆర్.టి.నెం. **951** (సిఇ అండ్ ఎస్‌డబ్ల్యు) శాఖ ప్రకారం కూడా **2.5** ఎకరాల మాగాణి లేదా **5** ఎకరాల మెట్ట ఉండి **1969** నుంచి దాన్ని అనుభవిస్తున్న షెడ్యూల్డు కులాలకు చెందిన శివాయి జమాదార్లను ఖాళీ

చేయించకూడదు. తర్వాత 13.8.79నాడు జారీ అయిన జి.వోఎం.ఎస్ నెం.129 (ఎస్.డబ్ల్యు శాఖ) ఈ పరిమితిని 5 ఎకరాల మాగాణి, 10 ఎకరాల మెట్టకు పెంచింది. గిరిజనేతర నిరుపేదలు ఎవరినైనా సరే ప్రభుత్వ భూముల్నించి ఖాళీ చేయించకూడదని చెప్పింది. దీనిపై ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ విద్యార్థులు యువజనుల సంఘం, కొవ్వూరు హైకోర్టుకు వెళ్లింది. ఆ జి.ఓను కొట్టేస్తూ హైకోర్టు (రిట్ పిటిషన్ నెం.1755/90) 5.12.1984న ఒక తీర్పు ప్రకటించింది. ప్రభుత్వ ఉత్తర్వు చట్ట విరుద్ధమైందని, అది దాని అధికార పరిధిలో లేని అంశమని కోర్టు పేర్కొంది. అయితే జి.ఓ 41ని కోర్టు కొట్టేయలేదు కనుక గిరిజన సంక్షేమ అధికారులెవరూ ప్రభుత్వ భూముల్ని ఆక్రమించుకున్న గిరిజనేతర శివాయి జమాదార్లను ఖాళీ చేయించడానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇది సహజంగానే గిరిజనులకు చాలా కడుపుమంట కలిగించింది.

ఈ సమయంలో 'శక్తి', 'తార' లాంటి ప్రభుత్వేతర సంస్థలు, సి.పి.ఎం లాంటి రాజకీయ పార్టీలు కలిసి గిరిజనులకు వారి భూమి హక్కుల గురించి వివరించి చైతన్యపరిచారు. 1996 నాటికి సమస్య హింసారూపం తీసుకుని గిరిజనులకు గిరిజనేతరులకు మధ్య వరసగా ఘర్షణలు జరగసాగాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి సీనియర్ అధికారులు మరోసారి పశ్చిమగోదావరి పరిణామాల వైపు దృష్టి సారించారు. జిల్లాలోని పరిస్థితిని సమీక్షించాక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తీసుకున్న నిర్ణయాలను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ 6-1-1997 నాడు నెం.2278/96/టిఆర్ఐ/ ఆర్ఎల్డబ్ల్యు ఫాక్స్ సందేశం ద్వారా అందరికీ తెలియపరిచారు. విషయాలు పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతో ఆ నిర్ణయాలనుగాని, తదుపరి సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలనుగాని నేనిక్కడ ప్రస్తావించడం లేదు. ఆదేశాలు ఇచ్చేటప్పుడు ప్రస్తావిస్తాను. ఫాక్స్ వర్తమానం అందాక ప్రభుత్వాధికారులు సర్వే ప్రారంభించినట్లున్నారు. కాని ఎన్.జి.వోలను, గిరిజనులను పాల్గొననివ్వక పోవడంతో పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా మారింది. వివిధ ఎన్.జి.వోలతో 17.2.1997 మధ్యాహ్నం 3.30 గంటలకు ముఖ్యమంత్రి ఛాంబర్స్‌లో సమావేశం జరపాలనే నిర్ణయమైతే తీసుకున్నారు కాని ఎందుచేతనో ప్రభుత్వం ఆ సమావేశాన్ని మాత్రం నిర్వహించలేదు.

పరిస్థితి ఇంకా క్షీణిస్తుండటంతో రెవిన్యూ మంత్రి అధ్యక్షతన కాబినెట్ సబ్

కమిటీ ఒకసారి **11.8.1997**న, మళ్లీ **24.9.1997**న, మళ్లీ **24.9.1997**న సమావేశమైంది. ఈ సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలేవీ సత్ఫలితాలను ఇవ్వలేదు. తనిఖీ కార్యక్రమం ఎలా జరపాలనేది వివాదాస్పదంగా మారింది. గిరిజనులు, ఎన్.జి.వోలు ఒక పక్షం, ప్రభుత్వం, గిరిజనేతరులు ఒక పక్షం వహించారు. 'శక్తి' డైరెక్టరుతో సీనియర్ అధికారులు సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి ఛాంబర్స్‌లో అక్టోబర్ **22 1997** సాయంత్రం **4** గంటలకు సమావేశమయ్యాక, తనిఖీకి సంబంధించి మరికొన్ని ఆదేశాలు జారీ అయ్యాయి.

**11.** ఈ కమిటీలు తీసుకున్న నిర్ణయాలను నేను పరిశీలించాను. అవి మొత్తం మీద ఉపయోగపడే చర్యలేనని నేను సంతృప్తి చెందాను. అయితే కొన్ని నిర్ణయాలకు వివరణ అవసరం. మరికొన్నిటికి సవరణ అవసరం. ఇది కాక ఆశించిన ఫలితాలు పొందడానికి, గిరిజనులకు గిరిజనేతరులకు మధ్య చాలా కాలం నలుగుతున్న వివాదానికి తెర దింపడానికి, ఆ ప్రాంతంలో శాంతి సామరస్యాలు పునరుద్ధరించడానికి మరికొన్ని ఆదేశాలు అవసరమని భావిస్తున్నాను.

**12.** పైన చెప్పినట్లుగా భూమి బదలాయింపు రెగ్యులేషన్లను అమలు జరుపుతున్నామనే అభిప్రాయం కలిగించడానికి ప్రభుత్వాధికారులు ప్రయత్నించారు కాని సరైన దృక్పథంతో వాటిని అమలు జరిపిన వాళ్లెవరూ లేరని ఈ కోర్టు భావిస్తోంది. దీని వల్ల గిరిజనులు కూడు, గూడు, గుడ్డ లేని నిరుపేదరికంలో జీవించాల్సి రావడమే కాక వారికి శాంతిభద్రతలు కూడా కరువయ్యాయి. అదే విధంగా గిరిజన ప్రాంతానికి వలస వచ్చి ఆస్తులు సంపాదించుకున్న గిరిజనేతరుల పరిస్థితి కూడా అగమ్యగోచరంగా ఉంది. వారి నెత్తి మీద కత్తి ఎప్పుడూ వేలాడుతూనే ఉంది. ఇద్దరి హక్కులూ పరిరక్షించబడటమే కాక ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం కూడా అవసరమని భావిస్తున్నాను.

అందువల్ల వివిధ కమిటీలు తీసుకున్న నిర్ణయాలను కోర్టు ఉత్తర్వు రూపంలో ప్రకటించి, వాటి అమలుకు నిర్ణీత గడువు పెట్టాలని భావిస్తున్నాను. ఈ కింది ఆదేశాలు సమగ్రమైనవి, ఒకేఒకసారి అమలు చేయాల్సినవి. మరో విధంగా చెప్పాలంటే ఈ కింది ఆదేశాలకు అనుగుణంగా తయారు చేయబోయే భూమి హక్కుల రికార్డు తుది రికార్డు అవుతుంది. ప్రభుత్వంతో సహా అందరూ దానికి కట్టుబడి ఉండాలి. హైకోర్టులో మాత్రమే దాన్ని సవాలు చేయొచ్చు.

## 13. జిల్లాస్థాయి కమిటీ

1. ప్రభుత్వ భూముల కేటాయింపుతో సహా భూబదలాయింపు రెగ్యులేషన్ల అమలు మొత్తం ప్రక్రియ జిల్లాస్థాయి కమిటి పర్యవేక్షణలో జరగాలి. రాజకీయపార్టీలు, ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులతో కూడిన ఈ కమిటీకి జిల్లాకలెక్టర్ అధ్యక్షులుగా ఉంటారు. ప్రతి పార్టీ లేదా సంస్థ నుంచి ఒక ప్రతినిధి ఉండొచ్చు.

2. జిల్లా స్థాయి కమిటి, గ్రామస్థాయి కమిటీలు తాము తీసుకునే నిర్ణయాలను ఎప్పటికప్పుడు తీర్మానాల రూపంలో తమ తమ మినిట్స్ పుస్తకంలో రాసి పెట్టుకోవాలి.

3. ప్రభుత్వ గ్రామాలలో **1919, 1934** సంవత్సరాలలో జరిగిన సర్వే రికార్డులు ఇరువర్గాలు చెప్పే విషయాల తనిఖీకి ప్రాతిపదికగా ఉంటాయి.

4. రెవిన్యూ మంత్రి ఛాంబర్స్‌లో **11.8.1997**నాడు జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం మినిట్స్ ప్రకారం మూడు మండలాల్లోని **22** వి.ఎ.ఓ ఉద్యోగాలు ఖాళీగా, ఉన్నాయని కలెక్టరు చెప్పినట్లుగా ఉంది. వీటిని గిరిజన అభ్యర్థులతో నింపాలంటే చాలా సమయం పడుతుంది కనక సర్వే కార్యక్రమాలు నిర్వహించడానికి, తనిఖీ జరపడానికి రిటైరయిన వి.ఎ.ఓలను లేదా అర్హత కలిగిన వి.ఎ.ఓలను నిర్దిష్ట మొత్తాలు చెల్లించి తీసుకోవచ్చు.

5. జిల్లా కమిటీయే అన్ని ప్రభుత్వ గ్రామాలలో కమిటీలను నెలకొల్పాలి. రికార్డుల పునఃతనిఖీని పర్యవేక్షించడమే కాక తనిఖీ సమయంలో శాంతికి భంగం వాటిల్లకుండా చూసే బాధ్యత కూడా వారిదే.

6. గ్రామకమిటీలో సర్పంచ్‌కాక వి.డి.ఓ, ముగ్గురు గిరిజనులు, ఒక షెడ్యూల్డు కులాల వ్యక్తి, ఒక వెనకబడిన తరగతుల వ్యక్తి, మరో కులం వ్యక్తి ఒకరు ఉండాలి. వీరిలో ఒకరు స్త్రీ అయి ఉండాలి. రెవిన్యూ చట్టాలతో, సర్వే పనులతో బాగా పరిచయమున్న వ్యక్తులెవరైనా – రిటైరయిన ఎం.ఆర్.ఓ, అసిస్టెంట్ కలెక్టర్ వగైరా – ఎన్.జి.ఓ ప్రతినిధిగా గ్రామ కమిటీలో ఉండొచ్చు.

ఈ రిటైరయిన ఉద్యోగులకు ఎంత చెల్లించాలో జిల్లా కమిటీ నిర్ణయిస్తుంది.

7. తనిఖీ పనిని ప్రారంభించడానికి కనీసం రెండు వారాల ముందు ఈ కమిటి గ్రామపటాల్ని తయారు చేసి గ్రామచావిడి దగ్గరగాని, మరో కూడలి స్థలంలోగాని

వాటిని ప్రముఖంగా ప్రదర్శించాలి. రెవిన్యూ రికార్డుల ఆధారంగా గిరిజనుల భూముల్ని, గిరిజనేతర భూముల్ని, గిరిజనేతరుల ఆక్రమణలోని గిరిజనుల భూముల్ని, గిరిజనులకు, గిరిజనేతరులకు ప్రభుత్వం ఇచ్చిన భూముల్ని, వెంటనే కేటాయించడానికి వీలున్న ప్రభుత్వ భూముల్ని స్థానికులకు సులభంగా అర్థమయ్యేందుకుగాను వేరు వేరు రంగులు వేసి ఈ మ్యాప్‌లను తయారు చేయాలి. వీటితో పాటు భూములకు సంబంధించిన అన్ని వివరాలూ - సర్వే నెంబరు, పట్టాదారు పేరు, ఎవరి అనుభవంలో ఉన్నదీ, సాగులో ఉన్నదీ లేనిదీ వగైరా వివరాలన్నీ తెలిపే స్టేట్మెంటును కూడా అందరికీ అందుబాటులో ఉంచాలి.

**8.** ఇది జరిగాక సంబంధిత ఎం.ఆర్.ఓ ఒక వారం రోజుల పాటు ఇరుపక్షాల వారికి లేదా ఎన్.జి.ఓ సంస్థల ప్రతినిధులకు రెవిన్యూ రికార్డులను అందుబాటులో ఉంచేలా ఆదేశించాలి. తనిఖీ తేదీలను, వేళలను జిల్లా కమిటీ నిర్ణయించవచ్చు.

**9.** పైన చెప్పిన ప్రకారం తాజా సమాచారం చేర్చి రికార్డులను తయారు చేశాక జిల్లా కమిటీ ఏ రోజు ఏ గ్రామానికి తనిఖీ బృందాన్ని పంపబోతోందో ఆ కార్యక్రమ వివరాలను కనీసం రెండు వారాల ముందు స్థానిక (తెలుగు) పత్రికలలో ప్రకటించాలి. వీటికి తోడు గ్రామ కమిటీ పర్యవేక్షణలో ఆయా గ్రామాలలో ముందుగానే టముకు వేయించాలి.

కార్యక్రమ పట్టికలో ఈ కింది అంశాలు ఉండాలి:

ఎ).సర్వేనెంబర్లు, యజమానుల పేర్లున్న గ్రామపటాన్ని ఏ రోజు గ్రామంలో ప్రదర్శించబోతున్నారో ఆ తేదీని పేర్కొనాలి.

బి).ఎం.ఆర్.ఓ ఆఫీసులో ఏ తేదీన లేదా తేదీలలో రికార్డులను తనిఖీకి అనుమతిస్తారో, ఎన్ని రోజులలో ప్రజలు తమ అభ్యంతరాలను లేదా క్లయిమ్‌లను తెలియపరచాలో ఆ వివరాలు ఉండాలి.

సి).ప్రభుత్వాధికారులు ఏ రోజున గ్రామానికి వచ్చి రెవిన్యూ రికార్డుల ఆధారంగా భూమిని తనిఖీ చేయనున్నారో ఆ తేదీని ప్రకటించాలి.

డి).ఇరుపక్షాల వారికి నోటీసుల్ని అందజేసే బాధ్యత గ్రామకమిటీ నిర్వహిస్తుందని చెప్పాలి.

ఇ). భూబదలాయింపు రెగ్యులేషన్ల కింద స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గిరిజన సంక్షేమం) దగ్గర క్లయిమ్‌లు దాఖలుచేయడానికి గడువు తెలియపరచాలి.

10. గ్రామాలవారీగా చేపట్టబోయే పనులను బట్టి జిల్లా కమిటీ రెవిన్యూ, సర్వే శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని అడిగి తీసుకుంటుంది. ప్రతి బృందానికి ఎం.ఆర్.ఓ లేదా అంతకంటే పైస్థాయి అధికారి నాయకత్వం వహిస్తారు.

11. గిరిజనేతరులెవరైనా 1917 రెగ్యులేషన్ తర్వాత గిరిజనుల భూముల్ని ఆక్రమించుకున్నట్టు తనిఖీ సమయంలో వెల్లడయితే ఆ ఆస్తి మీద వారికి గల హక్కును నిరూపించుకోమని కోరడం జరుగుతుంది.

12. అవి న్యాయస్థానాలలో అపరిష్కృతంగా ఉన్నా సరే ప్రభుత్వ రికార్డుల ఆధారంగా, గిరిజనేతరుల దగ్గరున్న హక్కుపత్రాల (టైటిల్) ఆధారంగా వాటి భౌతిక తనిఖీ పనిని సర్వే బృందాలు పూర్తి చేసుకుంటాయి. అవసరమైతే కొంత గడువు ఇచ్చి గిరిజనేతరులను వారి హక్కుల్ని రుజువు చేసుకోమని చెప్పొచ్చు.

13. తనిఖీ పూర్తయ్యాక సర్వే ఫలితాల్ని వెల్లడిస్తూ గ్రామకమిటీ ఒక సంయుక్త ప్రకటన జారీ చేయాలి. పట్టాదారుల పేర్లు, వారి భూముల వివరాలు ఉన్న తుది జాబితా కాపీని కంప్యూటర్‌లోకి ఎక్కించడానికి ప్రాజెక్ట్ ఆఫీసరుకు ఇవ్వాలి. అలాగే తనిఖీ ఫలితాలను గిరిజన సంక్షేమ కమిషనర్‌కు నివేదించాలి.

14. తనిఖీ పూర్తయ్యాక రికార్డులకు ఐదు నకళ్లు తయారు చేసి ఒకటి కలెక్టర్ ఆఫీసులో, ఒకటి సబ్ - కలెక్టర్ ఆఫీసులో, మిగతావి ప్రాజెక్టు ఆఫీసరు దగ్గరా, ఎంఆర్ఓ దగ్గరా, గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ దగ్గరా ఉంచాలి. వాటిని భద్రంగా కాపాడడానికి సంబంధిత అధికారులు అన్నిరకాల చర్యలూ తీసుకోవాలి.

## 14. తరం కట్టిన మెట్టు గయాళు భూములు

1. ప్రభుత్వానికి చెందిన ఐదు ఎకరాల మాగాణి లేదా పది ఎకరాల మెట్టభూమిని ఆక్రమించుకున్న గిరిజనేతరులను తొలగించరాదని ఆదేశిస్తూ ప్రభుత్వం 13.8.1979నాడు జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్ నెంబరు 129 (ఎస్.డబ్ల్యు శాఖ)ను ఈ కోర్టు 5.12.1984 నాడు కొట్టి వేసిన సంగతి స్పష్టమే. అయితే 24.9.1997 నాడు జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం మినిట్స్ ప్రకారం ప్రభుత్వాధికారులు ఆ ఒక్క జి.వో మాత్రమే కొట్టివేయబడిందని, అంతకు ముందు జారీ అయిన రెండు జి.వోలు ఎం.ఎస్.నెంబరు 41 (రెవిన్యూ) - 12.10.71, ఆర్.టి.నెంబరు 951 (ఇ అండ్ ఎస్.డబ్ల్యు శాఖ)- 4.12.1974 ఇంకా అమలులోనే ఉన్నాయని భావిస్తున్నారని అర్థమవుతోంది.

అందువల్ల ఈ రెండు జి.వోల పరిధిలోకి వచ్చే గిరిజనేతర శివాయి జమాదార్లను తొలగించనవసరం లేదని వారు భావిస్తున్నారు.

పై జి.వోలన్నీ భూబదలాయింపు రెగ్యులేషన్లకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలనడంలో సందేహం లేదు. మూడో జి.వోను ఈ కోర్టు కొట్టేసింది కూడా. దాన్ని కొట్టేయడానికి చెప్పిన కారణాలు ఆ ముందు రెండు జి.వోలకు కూడా అంతగానూ వర్తిస్తాయి. చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వాలు ఇలాంటి జి.వోలు జారీ చేయకూడదనేది కోర్టులు గతంలో నిర్ణయించిన సూత్రమే. అందువల్ల గిరిజనేతర శివాయి జమాదార్లను కొనసాగించడానికి అనుమతించే అన్ని జి.వోలను పక్కనపెట్టి, ఎ.పి.భూఆక్రమణ చట్టాన్ని ఉపయోగించి ఈ జమాదార్లను ఆ భూముల నుండి తొలగించవలసి ఉంటుంది.

చట్టాన్ని బట్టి చూసినపుడు జి.వో.ఎం.ఎస్.నెంబరు **41**, జి.వో.ఆర్.టి. నెంబరు **951** పరిధిలోకి వచ్చే గిరిజనేతర శివాయి జమాదార్లను ఖాళీ చేయించకూడదనే క్యాబినెట్ సబ్‌కమిటీ నిర్ణయాన్ని అమలు చేయడానికి వీలు లేదు.

**2.** భూబదలాయింపు రెగ్యులేషన్లకు విరుద్ధంగా కేటాయించిన ప్రభుత్వభూములకు సంబంధించి ఆయా వ్యక్తులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి, వారు తెలిపే అభ్యంతరాలను ఏజెన్సీ చట్టాల ప్రమాణంతో పరిశీలించి ఉత్తర్వులు జారీ చేయాలి.

**3.** ఈ లోగా అందుబాటులో ఉన్న భూముల్ని ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అర్హత కలిగిన గిరిజనులకు కేటాయించాలి. రెండు నెలల లోపే ఈ పని పూర్తి కావాలి.

**4.** గిరిజనుల అవసరాల రీత్యా ఈ కేటాయింపు జరగాలి తప్ప రాజకీయ పక్షపాతానికి ఏ మాత్రం అవకాశం ఉండకూడదు.

**4.(ఎ).** అప్పీళ్లను తగ్గించేందుకు, అనవసర విమర్శలకు అవకాశం లేకుండా చేసేందుకు ఈ భూముల కేటాయింపు పనిని జిల్లా కమిటీయే స్వీకరించడం సముచితంగా ఉంటుంది.

**5.** దరఖాస్తుదారుల ఆర్థిక పరిస్థితి తదితర వివరాలతో ఎమ్మార్వోలు ఒక జాబితా తయారు చేయాలి. బోర్డు స్టాండింగ్ ఆర్డర్ల ప్రకారం నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి, ఈ భూముల కేటాయింపు జరపాలి.

**6.** ఈ తనిఖీ క్రమంలో ప్రభుత్వ భూముల్ని కోల్పోయే షెడ్యూల్డు కులాల శివాయి జమాదార్లకు, ఇతరులకు వారు ఇష్టపడితే మైదాన ప్రాంతంలో వేరే భూముల్ని కేటాయించాలి.

**7.** గిరిజనుల అనుభవంలోని ప్రభుత్వ భూముల పట్ల ఎలాంటి అభ్యంతరాలూ లేకపోతే రెండు నెలలోగా వారికి యాజమాన్య హక్కుల్ని దఖలు పరుస్తూ పట్టాలు ఇవ్వాలి.

## 5. ఎస్టేటు గ్రామాలు

ఎస్టేట్లు రద్దు చేసే ముందు వాటి యజమానులు హడావుడిగా నామమాత్రపు మొత్తాలు తీసుకుని బంజర్లతో సహా చాలా భూములకు పట్టాలు జారీ చేశారని **24.9.1997**న జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం మినిట్స్‌ను బట్టి తెలుస్తోంది. ఈ పట్టాలు ఇప్పటికీ సర్వేరికార్డులలో 'తరం కట్టిన మెట్టు గయాళు భూములు'గా నమోదు కాలేదని కూడా తెలుస్తోంది. ఎస్టేటు గ్రామాల భూములకు సంబంధించిన 'రెగ్యులేషన్ **2** ఆఫ్ **1970**' **3-3-1970** నుంచి అమలులోకి వచ్చినట్టు వారు పేర్కొన్నారు.

**1.** ఇప్పటివరకు ఇచ్చిన అన్ని పట్టాలను తిరగదోడి, పట్టాదారులకు తగినంత అవకాశం ఇచ్చాక రెగ్యులేషన్ల ప్రకారం వారు ఆ పట్టాలకు అర్హులో కాదో కారణాలు వివరిస్తూ సెటిల్‌మెంట్ ఆఫీసరు ఉత్తర్వులు జారీ చేయాలి.

**2. 9-8-1996**న జారీ అయిన జి.వో ఎం.ఎస్ నెంబరు **661** (రెవిన్యూ ఎస్‌ఎస్ -**1** శాఖ) కింద నియమించబడిన సెటిల్‌మెంట్ ఆఫీసరు రెగ్యులేషన్లలోని నిబంధనలను పాటించకుండా అన్ని కేసులనూ కొట్టివేసినట్టు కనిపిస్తోంది. గిరిజనులకు, ఎన్‌జివోలకు కూడా దీనిపై ఫిర్యాదు ఉంది. గిరిజన ప్రాంతంలో శాంతి భద్రతల సమస్య తలెత్తడానికి గల ముఖ్యమైన కారణాల్లో ఇది ఒకటి. సెటిల్‌మెంట్ ఆఫీసరు పరిష్కరించిన అన్ని కేసులనూ జిల్లా కమిటీ పరిశీలించి, తగిన ఆధారాలు లేకుండా ఆయన ఏ ఉత్తర్వు అయినా ఇచ్చి ఉంటే అది చెల్లదని ప్రకటించాలి. ఆ కేసులను తిరగదోడి, వాటిని మళ్లీ చట్టప్రకారం పరిశీలించి ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా సెటిల్‌మెంట్ ఆఫీసరును ఆదేశించాలి.

**3. 24.91997**న జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం మినిట్స్ ప్రకారం ఇదివరకటి ఎస్టేట్ గ్రామాలయిన **28** గ్రామాలలో వెంటనే కేటాయించడానికి

వీలైన 5500 ఎకరాల 'తరం కట్టిన మెట్టు గయాళు భూములు' ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ గ్రామాలలో ప్రభుత్వ భూముల కేటాయింపుకు సూచించిన సూత్రాలను, బోర్డు స్టాండింగ్ ఆర్డర్లను వీటి కేటాయింపులో కూడా ఖచ్చితంగా పాటించాలి.

4. గిరిజనులకు 'ఏక్‌సాల్' లీజుకు ఇచ్చిన భూములకు రెండు నెలలలోగా వారి పేరుతోనే పట్టాలు రాసి ఇవ్వాలి.

## 16. వివిధ చోట్ల పెండింగ్‌లో ఉన్న కేసుల పరిస్థితి

1. స్పెషల్ డిప్యూటి కలెక్టర్ ఎన్నికల డ్యూటీలో కనక లేకపోతే తన దగ్గర అపరిష్కృతంగా ఉన్న అన్ని కేసులనూ ఈ ఉత్తర్వు కాపీ అందిన నాలుగు నెలలలోగా పరిష్కరించాలి. ఎన్నికల పనిలో ఉంటే కనుక 1998 జూలై ఆఖరికి పూర్తి చేయాలి.

స్పెషల్ డిప్యూటి కలెక్టర్ ఇచ్చే ప్రతి ఉత్తర్వుకూ డాక్యుమెంటరీ, మౌఖిక సాక్ష్యాధారాలు ఉండాలని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఏ వ్యక్తి అయినా తన టైటిల్ డీడ్‌లను సహకార బ్యాంకులులాంటి ఆర్థిక సంస్థల దగ్గర తనఖా పెట్టినట్టు చెపితే వాటి సర్టిఫైడ్ కాపీలు తెచ్చి చూపించేందుకు అతనికి వ్యవధి ఇవ్వాలి. ఈలోగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కూడా ఆ ఆర్థిక సంస్థలను వాకబు చేసి, సమాచారం పొందే ప్రయత్నం చేయాలి. చివరికి 1919, 1933 ఆర్.ఎస్.ఆర్ ఆధారంగా తీర్పు ప్రకటించాలి.

2. ప్రభుత్వ ఏజెంట్ దగ్గరున్న అప్పీళ్లను 1998 జూలై 31వ తేదీలోగా పరిష్కరించాలి. ఏజెంటు ఇచ్చే ప్రతి ఉత్తర్వూ చట్టానికి అనుగుణంగా ఉండాలి.

అన్ని అపీళ్లూ పరిష్కారమయ్యేంత వరకు ఏజెంటు/ కలెక్టరు వారానికి ఒకసారయినా కోర్టు నిర్వహించేలా తన పనిని సర్దుబాటు చేసుకోవాలి.

ఆఫీసు నోట్ మీద ఆధారపడకుండా కలెక్టర్లు ఇరుపక్షాల వాదనలూ విని కోర్టులో అక్కడికక్కడే తీర్పుల్ని ప్రకటించాలి. ఇది న్యాయవాదుల సమక్షంలోనే జరిగితే, తీర్పు చెప్పడంలో ఏమైనా తప్పులు దొర్లితే అప్పటికప్పుడే సరిచేసుకునే అవకాశం ఉంటుంది.

3. ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న రివిజన్ పిటిషన్లను కూడా పైన చెప్పిన ప్రకారం 1998 జూలై 31వ తేదీలోగా పరిష్కరించాలి.

4. అప్పీళ్లు, రివిజన్లు పరిష్కరించే అధికారులు తమ దగ్గర ఉన్న కేసులను తనిఖీ కార్యక్రమం పూర్తయ్యాక మొదటి కోర్టులోనే వాటిని మళ్లీ విచారించి పరిష్కరించే అవకాశం ఉందేమో ఆలోచించి, దాని సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. కొత్త గ్రామరికార్డులు తయారయ్యాక, ఇరుపక్షాలకూ తమ వాదన వినిపించే అవకాశం ఇచ్చి అప్పుడు వాటిపై తుది నిర్ణయం తీసుకోవచ్చు.

5. ఇంతకు ముందే చెప్పినట్టు ప్రభుత్వ ప్లీడరు దీనికి సంబంధించి హైకోర్టులో ఉన్న అన్ని పెండింగ్ కేసులతో ఒక జాబితాను తయారుచేసి మళ్లీ కోర్టు తెరిచేనాటికి సమర్పించాలి. అప్పుడు పై ఆదేశాల వెలుగులో వాటిని వెంటనే పరిష్కరించడానికి వీలవుతుంది.

17. తనిఖీ కార్యక్రమంతో సహా ఏజెన్సీ చట్టాల అమలుకు సంబంధించిన వారందరినీ పై ఉత్తర్వులు పాటించవలసిందిగా ఆదేశిస్తూ ఈ కోర్టు ధిక్కరణ కేసును ఇంతటితో మూసేస్తున్నాము. పై మార్గదర్శక సూత్రాలలో దేన్ని ఉల్లంఘించినా కోర్టు దాన్ని తీవ్ర విషయంగా పరిగణిస్తుందని స్పష్టం చేస్తున్నాం.

★

## పశ్చిమగోదావరి జిల్లా జీలుగుమిల్లి మండలం,
## దర్భగూడెం శివారు గ్రామాలలో
# గిరిజన, గిరిజనేతరులు చేసుకున్న ఒప్పందం

1. భూవివాదాల వలన గత నాలుగేళ్లుగా శాంతి లోపించి, వ్యవసాయానికి అవసరమైన సామాజిక వాతావరణం దెబ్బతిని అనేక కష్టనష్టాలకు, ఆందోళనలకు గురైన మేము, ఈ క్రింద పేర్కొన్న నిర్ణయాలకు కట్టుబడి వుండటానికి అంగీకరిస్తున్నాం.

2. ఈ నిర్ణయాలను అమలు పరచడంలో సహాయపడటానికి ముగ్గురు సభ్యులతో సలహా సంఘాన్ని ఏర్పరచుకుంటున్నాం.

వారు -

1. చెరుకూరి సుందరరావు, మార్కండేయపురం, జంగారెడ్డి గూడెం

2. అల్లూరి సత్యసాయి, అడ్వకేటు, కొవ్వూరు

3. పి. బాలక్రిష్ణ, రిటైర్డ్ మండల రెవిన్యూ అధికారి

ఏవైనా అభిప్రాయభేదాలు వస్తే ఉభయవర్గాలు ఏర్పరచుకున్న కమిటీ ముందు సలహాసంఘం సహాయంతో పరిష్కరించుకుంటాం.

3. ఈ కమిటీ ఖర్చును ఇరుపక్షాలు – ఒక వంతు గిరిజనులు, రెండు వంతులు గిరిజనేతరులు – భరిస్తారు. ఇందుకోసం ఒక బ్యాంకులో సంయుక్త ఖాతా తెరుస్తారు. కమిటీ సభ్యులు తమ వర్గం వారి సొమ్ము వసూలు చేసి జమ చేస్తారు.

4. కోర్టు, ప్రభుత్వం రూపొందించిన విధానాలకు కట్టుబడి అధికారులు అనధికారులు చేపట్టే చర్యలకు ఉభయవర్గాలమూ సహకరిస్తాం. ఈ విధానాలు

అమలు పరచడానికి, 2000 సంవత్సరం జూన్ నెలాఖరు లోగా జిల్లాస్థాయిలో ఈ సమస్యలు పరిష్కారం కావడానికి కావలసిన ఏర్పాట్లని ఈ కమిటీ చేస్తుంది. ఈ విషయమై ఎవరు అశ్రద్ధ వహించినా దాన్ని ఉన్నతాధికారుల దృష్టికి న్యాయస్థానాల దృష్టికి తీసుకుపోవడానికి వెనకాడము.

5.ఉభయవర్గాల వారమూ ఎట్టి పరిస్థితులలోను పోలీసుజోక్యం కోరము. ప్రస్తుతం నడుస్తున్న కేసులన్నిటినీ ఉపసంహరించుకునేందుకు తగిన చర్యలు తీసుకోగలము. ప్రభుత్వం కూడా ఈ విషయమై సహకరించాలని కోరుతున్నాం.

6. జూన్ 2000 నాటికి జిల్లా స్థాయిలో సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకూ గిరిజనేతరుల స్వాధీనంలో ఉన్న భూమిలో ఒక్కొక్కరి కమతం నుంచి 20 శాతం గిరిజనులు కోరుకున్న భాగాన్ని వారికప్పగించడానికి అంగీకారం కుదిరింది. (ఇరువర్గాలకు ఆక్షేపణ లేని విధంగా)

7.ఇప్పుడు నిర్ణయించిన కమిటీని అసలైన గ్రామకమిటీగా గుర్తించాలని అధికారులను కోరుతున్నాం. కోర్టు ఉత్తర్వు ప్రకారం కమిటీకి తగిన విధంగా సహకరించాలని కూడా కోరుతున్నాం.

8. ఇంతవరకు ప్రభుత్వం గిరిజనులకు యిచ్చిన పట్టాభూములకూ, పై ఒప్పందానికీ ఏ విధమైన సంబంధం లేదు.

9. ఇందులో ఉభయవర్గాలు అంగీకరించిన కమిటీ మెంబర్ల మరియు సలహా సంఘం మెంబర్ల జాబితాను సమర్పించడమైంది. 2000 సంవత్సరం జనవరి మొదటి వారంలో కమిటీ సమావేశమై పరిస్థితిని మళ్లీ సమీక్షించాలని కూడా నిర్ణయించడమైనది.

**18.11.1999**

గిరిజనేతర మెంబర్లు

1.అలవాల వెంకట రెడ్డి (దర్భగూడెం)

2.ముప్పన ఏసుదాసు రెడ్డి ,,

3.ఎం.విజయకుమార్ ,,

గిరిజన మెంబర్లు

1.మొడియం ముత్యాలరావు

తపసివారిగూడెం

2.నారం ధర్మరాజు

పాతచీమలవారిగూడెం

3.పండు పెదకన్నయ్య

పండువారిగూడెం

"గిరిజనులకు గిరిజనేతరులకు మధ్య పోటీ ఒంటికాలి వ్యక్తికీ, రెండు కాళ్లున్న వ్యక్తికీ మధ్య పోటీలా మారినప్పుడు సమాజం కళ్లు మూసుకొని ఊరుకోలేదు. ఒక గిరిజనేతరుడుకీ మరో గిరిజనేతరుడికీ మధ్య (భూమి) బదలాయింపు వల్ల గిరిజనుల భూమి తరిగిపోని మాట నిజమేగాని అది యథాతథస్థితిని మాత్రమే కొనసాగిస్తుంది. గిరిజనుల మీద జరిగిపోయిన దోపిడీని అలాగే వదిలేయడం న్యాయమైన పనేనా? అది జరిగిన తప్పును సరిచేసే బదులు దానికి చట్టబద్ధత కల్పించడం కాదా? ఈ అన్యాయాన్ని తిరగదోడి యథాపూర్వ స్థితిని పునరుద్ధరించకుండా కేవలం యథాతథ స్థితిని కొనసాగించడమనేది అన్యాయం, అక్రమం, పూర్తిగా స్వేచ్ఛాయుతం".

– 14.07.1988న సుప్రీంకోర్టు 1/70 రెగ్యులేషన్‌ను ఆమోదిస్తూ ఇచ్చిన తీర్పులోని కొంతభాగం

ప్రతులకు:
పండు పెదవెన్నయ్య
పండువారిగూడెం
జీలుగుమిల్లి మండలం
ప.గో.జిల్లా

ప్రతులకు:
అలవాల వెంకటరెడ్డి
దర్భగూడెం
జీలుగుమిల్లి మండలం
ప.గో.జిల్లా